




Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com









ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 590 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 19 బుధవారం నవంబర్ 2025 పేజీలు : 4 వెల : అమూల్యం


## 20న నితీశ్ ప్రమాణస్వీకారం

### సిఎం చంద్రబాబుకు ఆహ్వానం

అమరావతి,నవంబర్18 :బిహార్ రాజధాని పాట్నాలో జరిగే సీఎం నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ మరోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అందుకు ముహూర్తం ఖరారు అయింది. సీఎం నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు ఆహ్వానం అందింది. నవంబర్ 20వ తేదీన వీరు బిహార్ వెళ్లనున్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే తరపున ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆ రాష్ట్ర పారిశ్రామికవేత్తలతో ఏర్పాటు చేసిన పలు సమావేశాల్లో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సంబంధించిన వివరాలను బిహార్‌లోని పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా వివరించారు. 243 అసెంబ్లీ స్థానాలు ఉన్న బిహార్ అసెంబ్లీకి రెండు విడతలుగా.. నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల ఫలితాలను నవంబర్ 14వ తేదీన లెక్కించారు. ఈ ఎన్నికల్లో బిహార్ ఓటరు ఎన్డీయేకు వరుసగా మరోసారి పట్టం కట్టాడు. జేడీ (యూ) అధినేత నితీశ్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. అందుకోసం రాజధాని పాట్నాలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఈ సీఎం నితీశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి.. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల పార్టీల అధినేతలు, మిత్రపక్షాలతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతోపాటు ఆయన కేబినెట్ సహచరులంతా హాజరవుతారని సమాచారం. సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారీ ఎత్తున ప్రముఖులు వస్తుండడంతో.. పాట్నాలో భారీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.



అన్నదాత సుఖీభవ

### ఈ నెల 19న రైతుల ఖాతాల్లోకి

## రెండో విడత నిధులు

- అన్నదాత సుఖీభవ రెండో విడత నిధుల విడుదలకు రంగం సిద్ధం
- 46 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,135 కోట్లు జమ
- ప్రతి రైతు కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర వాటాలు కలిపి రూ.7 వేలు
- నవంబరు 19న కమలాపురంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శ్రీకారం
- వ్యవసాయరంగంపై ప్రభుత్వ ఆలోచనల వివరణకు సన్నాహాలు

2

అమరావతి, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 18 : పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 19వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయనుంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించనున్నారు. రెండో విడతలో భాగంగా మొత్తం 46,85,838 రైతు కుటుంబాలకు రూ.3135 కోట్ల రూపాయలను ప్రభుత్వం అందించనుంది.








## 'యూరప్'లోని జన సైనికుల సేవలకు అభినందనలు

- మ్యూనిచ్, ఓస్లో సిటీల్లో జరిగిన "మీట్ అండ్ గ్రీట్"లో ఎమ్మెల్సీ కె.నాగబాబు



2

యూరప్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 18 : యూరోపియన్ దేశాల్లో స్థిరపడిన జన సైనికులు జనసేనకు అందిస్తోన్న సేవలు అభినందనీయమని, సమాజం పట్ల జన సైనికులకు ఉన్న బాధ్యత, అంకిత భావం చాలా గొప్పవని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి సభ్యుడు కె.నాగబాబు స్పష్టం చేశారు. యూరప్ దేశాల పర్యటనలో భాగంగా నాగబాబు జర్మనీలోని మ్యూనిచ్, ఓస్లో సిటీల్లో జరిగిన "మీట్ అండ్ గ్రీట్" కార్యక్రమంలో ముఖాముఖి మాట్లాడారు. యూరోపియన్ దేశాల్లో స్థిరపడిన అనేక మంది జన సైనికులు, వీర మహిళలు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచంలో ఏ మూలకు వెళ్ళినా జనసైనికులను కలిసి కాసేపు మాట్లాడితే కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేనిదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. వ్యక్తిగత పర్యటన అయినప్పటికీ ప్రత్యేక సమయాన్ని కేటాయించుకొని జన సైనికులను కలవడం, జన సైనికులతో పార్టీ కార్యక్రమాలను గురించి పరస్పరం చర్చించడం ఆనందంగా ఉన్నదని అన్నారు. ఎన్నికల సమయంలో ఎన్.ఆర్.ఐ. జనసైనికులు సుదూర ప్రాంతాల నుంచి రాష్ట్రానికి వచ్చి సేవలందించిన సందర్భం చాలా అభినందనీయమని అన్నారు.

## మావోయిస్టు అగ్రనేత మడావి హిడ్మా ఎన్ కౌంటర్?

అల్లూరి జిల్లా, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 18 : నక్సల్స్ మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత మాడావి హిడ్మా(43) హతమయ్యా డు. అతని భార్య కూడా మృతి చెందినట్లు సమాచారం. అల్లూరి జిల్లా రంపచోడవరం ఏజెన్సీలోని మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్కౌంటర్ జరిగినట్లు సమాచారం. ఈ మేరకు ఏపీ, తెలంగాణ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మాతో పాటు ఆయన భార్య హేమ కూడా చనిపోయారు. ఈ మేరకు ఏపీ డీజీపీ హరీష్ గుప్తా ప్రకటించారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల మధ్య పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు అడవుల్లో మావోయిస్టుల కదలికలు పెరిగినట్టుగా సమాచారం అందుకున్న పోలీసులు.. కూంబింగ్ నిర్వహించారు. అనంతరం మావోయిస్టులు కాల్పులు జరపగా.. పోలీసులు ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో హిడ్మా, హేమతో పాటు వీరికి సెక్యూరిటీగా ఉన్న నలుగురు మావోయిస్టులు చనిపోయినట్లు సమాచారం.



# ‘యూరప్’లోని జన సైనికుల సేవలకు అభినందనలు

పార్టీ కార్యక్రమాల పట్ల మా కర్తవ్యాన్ని తెలియజేయమని జర్మనీ జన సైనికులు నాగబాబుని కోరగా.. ఉన్నత చదువులు అభ్యసించి, సామర్థ్యాలను పెంపొందించుకుని అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డ ఎన్.ఆర్.ఐ. జన సైనికులు జనసేన కార్యకర్తలకు జీవిత లక్ష్యాల గురించి, వారి ఎదుగుదల గురించి ప్రేరణ కలిగే విధంగా ప్రోత్సహించాలని తెలియజేశారు. మీ ప్రతిభను సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకొని కార్యకర్తలను ఉత్తేజితులను చేయాలని తెలిపారు. సుపరిపాలన చూడాలంటే ప్రజలకు నాయకులకు మధ్య ఉండాల్సిన అవగాహన బాధ్యతలు, కర్తవ్యాలు, హక్కుల గురించి వివరించే ప్రయత్నం చేయండి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తోన్న సుపరిపాలన అంశాలు, ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిపాలన, ఆయన మంత్రిత్వ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురించి వివరించండి. రాజకీయాల్లో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం కొందరికి ఉండొచ్చు, మరికొందరికి ఉండక పోవచ్చు. కానీ ప్రతి ఒక్కరూ రాజకీయాలు పట్టించుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ప్రతి ఒక్కరూ రాజకీయాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని, రాజకీయాలు నచ్చవు, మాకు కుదరదు అనేవారి కారణంగా నష్టం జరుగుతోందని, రాజకీయ నాయకుల వ్యవహారశైలి పరీక్షించి వారిలోని లోపాలను, నైపుణ్యతను ప్రజలకు తెలియజేసే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్.ఆర్.ఐ. ముఖ్య నాయకులు వెంకీ పుష్పడపు, వైపనస రామకృష్ణ, సురేష్ వరికూటి, శివప్రసాద్ మత్రి, భరత్, వెంట్రప్రగడ, ప్రసాద్ ఉరుబండి, మధు నిట్టూరి, లోకేష్ పెద్దిరెడ్డి, చైతన్యసాయి తోట, దిలీప్ సాయి మండేల, మాధురి త్రిపురాణ, సునీల్ కోవెలకరు, రాజా చిక్కాల, సాయిపవన్ దాసి, పురుషోత్తం పూషాడపు, సుబ్రహ్మణ్యం యర్రపోతు, రాజు గరగ, ప్రతాప్ రేపల్లె, ఉదయ్ కాట్రెడ్డి, శంకర్ సిద్ధం, జగదీష్ కుర్లీ, వెంకటపతి తరిగోపుల, అప్పలనాయుడు, వెంకట్ కొండవీటి, నవీన్ కుమార్ బైరీ తదితరులు పాల్గొన్నారు.



# మనస్సుకు ఆహ్లాదం గ్రంధాలయాలు

## తెనాలి మున్సిపల్ కమిషనర్ జాగారపులి రామ అప్పలనాయుడు .

తెనాలి జిల్లా

: గ్రంథాలయాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ, పుస్తక పఠనాన్ని ప్రోత్సహించేలా, గ్రంథాలయ ఉద్యమకారులు సేవలను స్మరిస్తూ నిర్వహిస్తున్న58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ఐదవరోజు, మంగళవారం తెనాలి మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మార్కులు, ర్యాంకులు అంటూ అటు తల్లిదండ్రులు ఇటు పాఠశాల యాజమాన్యాలు ఒత్తిడికి గురిచేస్తున్న ఈ రోజుల్లో విద్యార్థులు ప్రతి విషయాన్ని అర్థం చేసుకుని చదివితే అది ఎప్పటికీ మనకి గుర్తుండిపోతుంది అన్నారు ఇంకా చిన్న చిన్న కథలతో పాటుగా నీతి పుస్తకాలు, కామిక్స్ పుస్తకాలు చదవాలన్నారు.గ్రంథాలయం సందర్శించి మహనీయుల జీవిత చరిత్రలు చదవడం వల్ల ఆలోచన ధోరణి పెరుగుతుందని , ఎక్కువగా పుస్తకాలు చదివే అలవాటు ప్రతి విద్యార్థి కలిగి ఉండాలన్నారు. మొబైల్ ఫోన్ల వాడకం తగ్గించి పుస్తక పఠనం వైపు పిల్లల ఆకర్షించేలా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.మున్సిపల్ శాఖవారు విధించే పన్నులలో గ్రంథాలయ సేవలు మరియు అభివృద్ధి కోసం టాక్స్ ఉంటుందని , ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలు ఉపయోగించుకోవాలని సూచించారు. మహిళా సాధికారత దిశగా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయుటకు త్వరలోనే ఈ మహిళా గ్రంథాలయంలో వర్క్ షాప్ నిర్వహించబోతున్నట్లు తెలిపారు ఈ అవకాశం పట్టణం లోని ఎక్కువ మంది మహిళలు ఉపయోగించుకోవాలని సూచించారు.. ఇంకా ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఈ ఎల్వి అప్పారావు, గ్రంథాలయ అభివృద్ధి సంఘం కార్యదర్శి,, స్వరలయ వేదిక వ్యవస్థాపకులు సాయి లక్కరాజు, తెనాలి పట్టణ ఆరోగ్యవిస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి , గ్రంథాలయ అధికారిణి కడియాల సుజాత మాట్లాడుతూ విద్యార్థులు తరచూ గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలు ఎక్కువగా చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు న విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు ఆర్ట్ టీచర్స్ అలపర్తి వెంకటేశ్వరరావు, బెల్లంకొండ వెంకట్, మస్తాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమంలో చల్లగాలి శ్రీదేవి , తన్నీరు శివ శంకర్, మెప్మా సీఎం ఏం విజయలక్ష్మి , హరికిషన్ , విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# అన్నదాత సుఖీభవ : ఈ నెల 19న రైతుల ఖాతాల్లోకి రెండో విడత నిధులు

ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.5 వేలు కలిపి ప్రతి రైతు ఖాతాలో మొత్తం రూ.7 వేలు జమ కానున్నాయి. ఇప్పటికే ఆగస్టు నెలలో తొలి విడత కింద రూ.3174 కోట్లు అందించగా, రెండు విడతల్లో కలిపి మొత్తం రూ.6309.44 కోట్లను రైతులకు అందజేసినట్లు అవుతుంది. ఈ నెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబు కమలాపురంలో జరిగే అధికారిక కార్యక్రమంలో పాల్గొని ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. పుట్టపర్తి పర్యటన ముగించుకున్న అనంతరం ఆయన మధ్యాహ్నం కమలాపురం చేరుకుంటారు. ఈ కార్యక్రమాన్ని కేవలం నిధుల విడుదలకే పరిమితం చేయకుండా, వ్యవసాయ రంగంలో ప్రభుత్వ ఆలోచనలను, భవిష్యత్ ప్రణాళికలను రైతులకు వివరించేలా నిర్వహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10 వేలకు పైగా రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు స్థానికంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా అగ్రిటెక్, డిమాండ్ ఉన్న పంటల సాగు, మార్కెటింగ్ సౌకర్యాలు, ప్రకృతి సేద్యం, భూసార పరీక్షల ప్రాముఖ్యత, ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా పంటకు అదనపు ధర కల్పించడం వంటి కీలక అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.

# మా గ్రామాలకు తక్షణమే బీటి రోడ్ వేయాలని రాస్తారోఖో నిర్వహించిన గ్రామ ప్రజలు.

శ్రీకాకుళం

శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం లోని చంగుడి,దశరథపురం, సరాలి వెళ్లే గ్రామాలకు రహదారిని వేస్తామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శంకుస్థాపన చేసి 8 నెలలు కావస్తున్న ఇప్పటివరకు రోడ్డు వేయలేదని రోడ్డుపై గ్రామస్తులు బైఠాయించి రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపివేసి రాస్తారోకో నిర్వహించారు.గతంలో 20 సంవత్సరాల క్రితం బీటి రోడ్డు వేశారని తర్వాత 8 సంవత్సరాలుగా రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రస్తుత పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వద్ద విన్నవించగా సుమారు రూ. 3 కోట్ల 5 లక్షలతో నిధులు కేటాయించారు. అయితే ఆ గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా దొలచి పెద్దపెద్ద మెటల్లు వేయడంతో రహదారి మీద ప్రయాణించాలంటే ముళ్ళకంప మీద నడిచినట్లు ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. సుమారు 8 నెలలు కావస్తున్న రోడ్లు పనులు జరుగుటలేదని దీని ద్వారా పాతపట్నం పర్లాకిమిడి వెళ్లాలంటే వాహనాలు అదుపుతప్పి గాయాల బారిన పడుతున్నామని అలాగే విద్యార్థులు సరైన సమయంలో స్కూళ్లకు వెళ్లలేక పోతున్నారని ఆటో, ద్విచక్ర వాహనాలు తదితర వాహనాలు మరమ్మతులకు గురువుతున్నాయని వారు వాపోతున్నారు. అత్యవసర సమయంలో ఏ ఆటోలు బుక్ చేయాలన్న ఈ రోడ్డుకు భయపడి వారు రావట్లేదని స్థానికులు తెలిపారు. ఈ గ్రామాలు తెలుగుదేశానికి కంచుకోటగా ఉండే గ్రామాలు. కానీ ప్రజలు విసిగిపోయి రోడ్లపై బైఠాయించవలసి వచ్చిందని సర్పంచ్ ప్రతినిధి గురాడి కాంతారావు అన్నారు. ఈ చుట్టుప్రక్క గ్రామాలు కూరగాయల పంటలు వేస్తూ రోజూ సైకిల్ పై, కావిళ్ళపై పాతపట్నం అలాగే ఒడిస్సా రాష్ట్రమైన పర్లాకిమిడికి



వెళ్లి అమ్ముతూ జీవనాలు కొనసాగిస్తున్నారని ఈ రోడ్ల పరిస్థితి బాగోకపోవడంతో తరచూ ప్రమాదాల గురవడం ఆసుపత్రులు పాలవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా గ్రామాలకు రోడ్లు వేయాలని లేకుంటే ప్రజలంతా ఎంత వరకు అయినా పోరాడుదుతామని వాళ్లు తెలిపారు.

# కోలాహలంగా మున్సిపల్ ప్రజారోగ్య సిబ్బంది ఉద్యోగుల కార్తీక వన సమారాధన



రేపల్లె

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఉద్యోగులు మంగళవారం రేపల్లె ఓల్డ్ టౌన్ లోని జమిందార్ కోటలో కార్తీక వన సమారాధన కార్యక్రమం కోలాహలంగా ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ కే సాంబశివరావు టిడిపి రాష్ట్ర కార్యదర్శి జి శ్రీనివాసరావు టిడిపి సీనియర్ నాయకులు మంత్రి సోదరులు అనగాని శివప్రసాద్ ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రెటరీ కామ్రేడ్ సామ్యూల్ కరీముల్లా ఏరియా సిపిఐ నాయకులు కే రమేష్ లు హాజరై సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్తీక వన సమారాధన కార్యక్రమం మున్సిపల్ ఉద్యోగులు సిబ్బంది ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ వనసమారాధన ద్వారా ఐకమత్యం పెంపొందుతుందని ఈ విధంగా వన సమారాధన ప్రజారోగ్య సిబ్బంది ఉద్యోగులు ఐక్యతతో ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు కార్తీకమాసం ముగుస్తున్నందున వన సమారాధన ఏర్పాటు చేసుకోవడం శు భ పరిణామన్నారు.. సిబ్బందికి ఉద్యోగులకు కార్తీక మాస శుభాకాంక్షలు తెలిపారు.. ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో సమారాధన జరుపుకోవాలని అన్నారు.. ప్రజారోగ్య సిబ్బంది ఉద్యోగులు కుటుంబ సభ్యులతో ఈ సమారాధన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు..

# ప్రతి రైతు నిర్ణీత నాణ్యత ప్రమాణాలు పాటించాలి..


రేపల్లె 18 11 25మండల కేంద్రము భట్టిప్రోలు గ్రామంలో వరి పంట కొనుగోలు అవగాహన కార్యక్రమం మండల రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు మండల వ్యవసాయ అధికారుల సమిష్టి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తహాశీల్దారు మాట్లాడుతూ , ఖరీఫ్ సీజనుకు గానూ చేపట్టు వరి పంట కొనుగోళ్ల గురించి దిశా నిర్దేశం చేశారు. మండలంలో వరి కోతకు వస్తున్నందున సంబంధిత అధికారులందరూ సన్నద్ధంగా ఉండి , రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా, గిట్టుబాటు ధర కి వారి వద్ద నుంచి కొనుగోలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ, పంట కోతకి వచ్చిన రైతులు వారి ధాన్యాన్ని బాగా ఎండ పెట్టుకోవటం ద్వారా, ధాన్యంలో తేమశాతం నిర్దిష్ట స్థాయికి తీసుకురావచ్చని , అప్పుడే పంట కొనుగోలు సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తవని వివరించారు. ప్రతీ రైతు కూడా నిర్ణీత నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందిగా కోరారు. ఇందులో భాగంగా ఆయన గ్రామ వ్యవసాయ సహాయకులకు పలు సూచనలు చేశారు. మండలంలో మొత్తం 5 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందని, ఆయా గ్రామాల్లో ఉన్న క్లస్టరు గ్రామాలన్ని ప్రధాన కేంద్రంలో ధాన్యం అమ్ముకోవచ్చని తెలియ చేశారు. ఇందులో భాగంగానే ఆయన ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేలా టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్లతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని విఏఏలకు విఆర్వోలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటి తహాశీల్దారు శాంతాలక్ష్మి, వ్యవసాయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

# పద్మశ్రీ ఆచార్య కూరెళ్ళ విఠలాచార్యని సందర్శించిన ఏకదంత ప్రాచీన భారతీయ విద్యా సంస్థ బృందము




యాదాద్రి భువనగిరి, నవంబర్ 18 : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో ఆధ్యాత్మిక విద్య మరియు సంస్కృత ప్రాచీన విద్యా పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తున్న ఏకదంత %-% ద స్కూల్ ఆఫ్ ఇన్సెంట్ ఇండియన్ స్టడీస్ సభ్యుల బృందము పద్మశ్రీ ఆచార్య కూరెళ్ళ విఠలాచార్యని మర్యాదపూర్వకంగా సందర్శించింది. ఈ సందర్భంగా ఆచార్య తన జీవనయానం, గ్రంథాలయ సేవ, విద్యా త్యాగం గురించి పంచుకున్న అనుభవాలు అందరినీ లోతుగా ప్రభావితం చేశాయి. తన స్వంత ఇంటినే ప్రజలకు అందుబాటులో ఉండే గ్రంథాలయంగా మార్చి జ్ఞానసేవకు జీవితాన్ని అంకితం చేసిన విఠలాచార్య బాల్యంలోని కష్టాలను తేటతెల్లంగా గుర్తుచేసుకున్నారు. “పుస్తకం కొనలేని రోజులు%"% ఎవరి దగ్గర ఉన్నాయో తీసుకుని చదివి తిరిగి ఇచ్చేవాడిని,” అన్న ఆయన మాటలు అక్కడున్న వారిలో గౌరవభావాన్ని కలిగించాయి. 1954లో సుమారు 500 పుస్తకాలతో తొలి గ్రంథాలయాన్ని



స్థాపించి, అప్పటి దొరగారితో ప్రారంభం చేయించడం ఆ రోజుల్లో ఒక అసాధారణమైన సంఘటన అని ఆయన వివరించారు. “ఎవరో మహాత్ములు నాకు అన్నం పెట్టారు. ఆ అన్నమే నన్ను అక్షరజ్ఞానానికి చేర్చింది. నేను రాసిన శతకంలో వారి పేరును ముందు పెట్టుకోవడం నా కృతజ్ఞత” అని ఆయన హృదయపూర్వకంగా తెలిపారు. ఈ సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ మన్ కి బాత్ కార్యక్రమంలో ఆచార్య కూరెళ్ళ విఠలాచార్య సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించిన విషయం గుర్తుచేసుకోవాల్సిందే. గ్రామీణ ప్రాంతంలోనూ ప్రజలకు జ్ఞానం



అందించేందుకు తమ జీవితాన్ని సమర్పించిన మహనీయునిగా



ఆయనను అభివర్ణించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆయన నిరంతర సేవకు గౌరవార్థం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించి సత్కరించింది. ఈ సందర్శనలో ఏకదంత వ్యవస్థాపకుడు మరియు దర్శకులు యం.వి.సతీష్ కుమార్, ప్రధాన ఆచార్య చింతకింది సద్గుణ, నందూరు ఆంజనేయప్రసాద్, నందూరు భాగ్య, చిరంజీవి నందూరు క్రియ పాల్గొన్నారు. ప్రాచీన జ్ఞాన పరిరక్షణ కోసం కఠినంగా కృషి చేస్తున్న ఈ యువ బృందాన్ని చూసి ఆచార్య ఆనందం వ్యక్తం చేసి అందరిని సత్కరించారు. ప్రాచీన భారతీయ విద్యా పరంపరను భవిష్యత్తు తరాలకు చేరవేసే ప్రయత్నాల్లో ఈ సందర్శనం మరో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని ఏకదంత వ్యవస్థాపకుడు మరియు దర్శకులు యం.వి.సతీష్ కుమార్ తెలియజేశారు.

# దళిత, బహుజన, గిరిజనుల ఐక్య పోరాటంతోనే మోదీకి బుద్ధిచేపుదాం

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు - సామాజిక న్యాయం, ఆత్మ గౌరవం కై సీపీఐ నిరసన ప్రదర్శన**

రాజమండ్రి, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 18 : దళిత, బహుజన, గిరిజనులందరూ మోడీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాటం చేయాలని అప్పుడే కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సామాజిక న్యాయం ఆత్మగౌరవం జనగణనలో కుల గణన చేపట్టాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ సిపిఐ జాతియ సమితి పిలుపుమేరకు జనగణలో కులగనన చేపట్టాలని, సామాజిక న్యాయం ఆత్మగౌరవం తదితర అంశాలపై ఈ దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన అన్నారు. కేంద్రంలోకి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చి గత 11 ఏళ్ళ కాలంలో దళిత, గిరిజన, మైనార్టీ, వర్గాలపై దాడులు మితిమీరి పోయాయని మధు అన్నారు. దేశంలో మతోన్మాద పాలన సాగుతుందన్నారు. అణిచివేత అంటరానితనం కుల మత వివక్షత హింస పేట్రేగిపోతుందని ఆయన అన్నారు. ఆర్ఎస్ఎస్ సంఘ పరివార్ కనుసన్నలలో భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన కొనసాగుతుందని ఆయన చెప్పారు. రాజ్యాంగం మానవ హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రా తత్వాన్ని మోదీ ప్రభుత్వం పాతర వేసిందని ఆయన అన్నారు. మన రాష్ట్రంలో దాదాపు 143 వెనుకబడిన కులాలు ఉన్నాయని, గత స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వలన వేల సంఖ్యలో స్థానిక సంస్థలకు చెందిన పదవులు బీసీలు కోల్పోయారని మధు అన్నారు. తెలంగాణలో ప్రభుత్వం జనాభ లెక్క సందర్భంగా కులగణను చేపట్టి అందుకని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయిస్తూ అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదించిందని మధు అన్నారు. అదేవిధంగా మన రాష్ట్రంలో కూడా జనగణలో కులగణను చేపట్టి కులాల ప్రతిపాదన బీసీలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలని మధు కోరారు.

భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య హక్కులను హరించే దుష్టశక్తులను తిప్పికొట్టేందుకు దళితులు, గిరిజనులు, బహుజనులు, మైనార్టీలు ఐక్యమై పోరాటానికి సిద్ధం కావాలని మధు పిలుపు నిచ్చారు. అనంతరం రాజమ%శీ%ద్రి సబ్ కలెక్టర్ ఆఫీస్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, జట్ల




సంఘం అధ్యక్షుడు కె.రాంబాబు, సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి పి.లావణ్య, జట్ల లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రిమూర్తులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.సునీల్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు పి.కొండావతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి రమణ, అల్లం వెంకటేశ్వరరావు, జట్ల సంఘం అధికార బాడి నల్ల రామారావు, దేవుడు బాబు, కాళ్ళ అప్పలనాయుడు, రెడ్డి వెంకట్రావు, పార్టీ నగర కార్యవర్గ సభ్యుడు టి.నాగేశ్వరరావు, పార్టీ జిల్లా సమితి సభ్యురాలు కాకి శారద పోలమ్మ తదితరులు నాయకత్వం వహించారు.

# పత్రికా రంగంలో నిబద్ధత కావాలి

**ప్రముఖ జర్నలిస్ట్ బెల్లంకొండ బుచ్చి బాబు**

తణుకు, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 18 : స్వాతంత్ర్య ఉద్యమంలో పత్రికలు ప్రముఖ పాత్ర వహించాయనీ, పత్రికలు సమాజ శ్రేయస్సుకు, అభివృద్ధికి మార్గదర్శకత్వం వహించాలని ప్రముఖ జర్నలిస్టు బెల్లంకొండ బుచ్చిబాబు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక పురుషుల శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో బెల్లంకొండ బుచ్చిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని "సామాజిక అభివృద్ధిలో మీడియా పాత్ర" అనే అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. భారత దేశంలో మొదటి పత్రిక 1780వ సంవత్సరంలో ఆంగ్లంలో ప్రచురించిన "బెంగాల్ గెజిట్" అనీ, తెలుగులో మొదటి పత్రిక 1902లో ప్రచురించిన "కృష్ణా పత్రిక" అనీ ఆయన వివరించారు. ఆనాడు పత్రికలు స్వాతంత్ర్య సమరంలో దేశభక్తులకు, ప్రజలకు స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిల్చాయని బుచ్చిబాబు పేర్కొన్నారు. పత్రికలు సమాజ శ్రేయస్సుకోసం నిబద్ధతతో కూడిన సత్యమైన వార్తలు ప్రచురించాలని కోరారు. ముందుగా సభకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి, తణుకు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు స్వాగతం పలికారు. సభకు మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కౌరు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సభలో మరో ముఖ్య అతిధి, స్థానిక ఇంపల్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కలగ నాగ వెంకట రామ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చెయ్యాలని, సెల్ ఫోన్ కు దూరంగా ఉండి, విద్యార్థులు తమ పాఠ్య పుస్తకాలు సమగ్రంగా చదువుకోవాలని హితవు పలికారు. అదే విధంగా విద్యార్థులు గ్రంథాలయం సందర్శించి దిన, వార, మాస పత్రికలు, రిఫరెన్స్ పుస్తకాలు అధ్యయనం చేసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని హితవు పలికారు. సభలో చివరిగా బెల్లంకొండ బుచ్చిబాబు, కలగ నాగ వెంకట రామ్ కుమార్ లను దుశ్శాలువాలతో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి కౌరు వెంకటేశ్వర్లు, కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి గుత్తికొండ కృష్ణారావు ప్రభృతులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆంగ్ల భాష అధ్యాపకులు, టీవీ %ౖ% సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ కోట రామ ప్రసాద్, గ్రంథాలయాధికారి గుత్తికొండ కృష్ణారావు భార్య గుత్తికొండ స్రవంతి, తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ కళాశాలలో నడుస్తున్న వాకర్స్ క్లబ్ నాయకులు కోడూరి ఆంజనేయులు, మానవతా నాయకులు ఆలపాటి సుబ్బారావు, రోటరీ క్లబ్ నాయకులు అక్కిన కాశీ విశ్వనాథం, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కోశాధికారి అర్జి భాస్కరరావు, రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం, శ్రీ శ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ పోపూరి దక్షిణా మూర్తి, ప్రముఖ కవి వి.ఎస్.వి.ప్రసాద్, గ్రంథాలయ అభివృద్ధి




కమిటీ యం.ఉమాజ్యోతి, రిటైర్డ్ ఉపాధ్యాయులు మహమ్మద్ స్వాలీహా, రికార్డ్ అసిస్టెంట్ రాగాల పృథ్వీ నారాయణ ప్రభృతులు, చదువరులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. చీకటి శ్రీనివాసరావు వందన సమర్పణతో నాటి సభ ముగిసింది. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.


# రైతుల ఖాతాలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండో విడత నిధులు జమ

**ఈ రోజు పత్తికొండ మండలంలోని పందికోన పులికొండ గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది....**

పత్తికొండ

పత్తికొండ నియోజకవర్గం లో ఉన్న మండలాల వారిగా అన్నదాత సుఖీభవ మరియు పిఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాలో రేపు గౌరవ భారత దేశ ప్రధానమంత్రి గారు మరియు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రైతుల ఖాతాలోకి జమ చేయుచున్నారు అలాగే పత్తికొండ మండలంలో 10081 రైతులకు గాను అన్నదాత సుఖీభవ పథకం కింద 5.04 కోట్లు అలాగే పిఎం కిసాన్ సన్మానిది కింద 1.77 కోట్లు మొత్తం 6.81 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో జమ అవుతున్నాయి

అదే విధంగా మండలంలో ఎవరైనా మినుమ పంట సాగు చేసుకొనే రైతులు ఉంటే సంబంధిత రైతు సేవ కేంద్రాన్ని సంప్రదించి మినుము %ఎదీచీ%-8 మరియు %ఎదీచీ%-10 రకం విత్తనాలు గ్రామాలలోని రైతు సేవకేంద్రంలో తీసుకోవాల్సిందిగా చెప్పడం జరిగింది




అదేవిధంగా రేపు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు చేతుల మీదుగా పిఎం-కిసాన్ మరియు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమం అన్ని రైతు సేవ కేంద్రాల్లో మధ్యాహ్నం 1:00 గంటల నుంచి 4:00 గంటల వరకు ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని రైతులు గ్రామాలలోని రైతు సేవ కేంద్రాల్లో పాల్గొనాలని చెప్పడం జరిగింది

పత్తి సాగు చేసిన రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు పథకం క్రింద రైతు సేవ కేంద్రంలోని సిబ్బందితో CM (Comprehensive Monitoring of Agriculture, Price, and Procurement )యాప్ నందు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తరువాత కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని ప్రభుత్వాన్ని ఇచ్చే మద్దతు ధరకు అమ్మకాలు చేపట్టాలని రైతులకు తెలియజేయడం జరిగింది. చాలామంది రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకొని అమ్మకాలు చేసుకుంటున్నారు పత్తిలో తేమశాతాన్ని 9% తక్కువ ఉండేటట్లు చూసుకోవాలి పత్తిలో ఎలాంటి ఆకులు పుల్లలు లేకుండా చూసుకోవాలి కోత ప్రకారంగా తీసినటువంటి పత్తిని విడిగా ఉంచుకొని బాగా గ్రేడింగ్ చేసుకొని మార్కెట్కు తీసుకువెళ్లడం వలన మీకు మంచి రేటు వస్తుంది రైతులకు అవగాహనా కల్పించడం జరిగింది

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ వెంకటరాముడు గ్రామ రైతులు మరియు రైతు సేవ కేంద్రం సిబ్బంది మండల వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.



# శబరిమలకు వెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త!

కేరళ, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 18 : శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లే భక్తులకు కేరళ ప్రభుత్వ ఆరోగ్య శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. కేరళలో అమీబిక్ మెనింజోఎన్సెఫలిటిస్ (బ్రెయిన్ ఫీవర్) కేసులు పెరుగుతున్న తరుణంలో నది స్నానం చేసేటప్పుడు భక్తులు కాస్త అప్రమత్తంగా ఉండాలంటూ ఆరోగ్య శాఖ సూచనలు చేసింది. ముక్కులోకి నీరు పోకుండా జాగ్రత్త తీసుకోవాలని.. వేడి నీళ్లు మాత్రమే తాగాలంటూ సలహా ఇవ్వడం జరిగింది. అంతేకాదు.. భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని అధికారులు తెలియజేశారు. అటు కేరళలో మొత్తం 69 బ్రెయిన్ ఫీవర్ కేసులు నమోదు చేశామని ... ఇప్పటిదాకా 19 మంది మృతి చెందారని అధికారులు వెల్లడించారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటుకరణకు వ్యతిరేకంగా సంతకాలు సేకరణ




యు.కొత్తపల్లి, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 18 : పిఠాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వంగా గీతా విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఉప్పాడ కొత్తపల్లి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వాకతిప్ప గ్రామంలో ఈ సంతకాల సేకరణ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధనీడి సుజాత పాల్గొని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ రద్దు చేసే వరకు గ్రామస్థాయి నుండి పోరాటం చేసే విధంగా మహిళలను చైతన్యవంతులను చేస్తామని తెలిపారు. సామాన్యుడికి అందుబాటులో ఉండే మెడికల్ విద్యను ప్రైవేటు పరువు చేయడం తగదని ప్రభుత్వానికి హితవు పలికారు. గత వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి నల్ల కుళ్ళిపోయిన మెడికల్ కాలేజీలను ఏ స్వార్థంతో ప్రైవేట్ పరం చేస్తున్నారు. అనే విషయం ప్రజలకు తెలియాలని సుజాత ఈ సంతకాల సేకరణలో భాగముగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జ్యోతుల వాణి, ఆలపు సుధారాణి, రాసంశెట్టి భవాని, వడ్డీ నాగమణి, అనిశెట్టి సుభాషిని, నరకుర్తి వెంకటలక్ష్మి, పల్లా బేబీ రాణి, జిగటాల లక్ష్మీకాంతం, బత్తిన రాణి, మండల పార్టీ అధ్యక్షులు ఆనాల సుదర్శన్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు రావు చిన్నారావు, గోపి హరిబాబు, మేక నాని, సాకా చిన్నబ్బాయి, బోడపాటి రాజేష్, కాళ్ల గోవిందు, పులపకూర లావణ్య, ఎద్దు అప్పలరాజు, సికోలు సత్తిబాబు, పల్లా రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాపులు మిగిలిన సామాజిక వర్గాలను కలుపుకుని ముందుకు వెళ్ళాలి

**- కూకట్ పల్లి కాపు వనభోజన కార్యక్రమంలో బండారు శ్రీనివాస్**



హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 18 : కాపు యువత అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరం కూకట్ పల్లిలో జరిగిన 39వ వనభోజన మహోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జనసేన నాయకుడు పంచకర్ల సందీప్ తో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కాపులు మిగిలిన సామాజిక వర్గాల వారందరినీ కలుపుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. పదేళ్ల క్రితం కూకట్ పల్లిలో ఇదే వనభోజనాలు భువన విజయం పేరుతో జరిగాయని, అప్పట్లో కేవలం 2వేల మంది మాత్రమే హాజరయ్యారని, నేడు అశేష సంఖ్యలో ఈ కార్యక్రమానికి కాపులు తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. గతంలో వంగవీటి మోహన రంగా రూపంలో ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చినా, కొన్ని దుష్టశక్తుల వల్ల ఆ అవకాశం చేజారిందని, ఈసారి మరలా ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉన్న నాయకుడు వచ్చారని పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆయనకు సంపూర్ణంగా మద్దతు ఇవ్వాలని బండారు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బండారు శ్రీనివాస్ ప్రసంగానికి ఆహుతుల నుంచి విశేష స్పందన లభించింది.

# వేదిక నుండి - వెండి తెరకు

మహోన్నత నటుడుఅక్కినేని నాగేశ్వరరావు (1924, సెప్టెంబరు 20 %-% 2014, జనవరి 22) తెలుగు నటుడు, నిర్మాత. ఒక రైతు కుటుంబంలో పుట్టి, నాటకరంగం ద్వారా వెండితెర మీదకు వచ్చిన వ్యక్తి నాగేశ్వరరావు. తెలుగు సినిమా తొలినాళ్ళ అగ్రనాయకులలో ఒకడు. సుమారు 255 చిత్రాల్లో నటించాడు. నాటకాలలో స్త్రీ పాత్రల ద్వారా ప్రాముఖ్యత పొందాడు. ధర్మపత్ని సినిమాతో అతడి సినీ జీవితానికి తెరలేచింది. అప్పటినుండి రకరకాల తెలుగు, తమిళ సినిమాలలో 75 సంవత్సరాలకు పైగా నటించాడు. ఎన్.టీ.ఆర్ తో పాటు తెలుగు సినిమాకి మూల స్తంభంగా గుర్తించబడ్డాడు. మూడు ఫిల్మ్ ఫేర్ తెలుగు అత్యుత్తమ నటుడు పురస్కారాలు అందుకున్నాడు. భారతీయ సినీరంగంలో చేసిన కృషికి దేశంలో పౌరులకిచ్చే రెండవ పెద్ద పురస్కారమైన పద్మ విభూషణ్ పురస్కారంతో పాటు భారత సినీ రంగంలో జీవిత సాఫల్య పురస్కారమైన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు పొందాడు. ఎన్టీ రామారావుతో కలిసి 14 సినిమాల్లో నటించాడు. దాసరి నారాయణరావు ఎన్.టి.రామారావు అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినిమాకు రెండు కళ్ళని వ్యాఖ్యానించాడు. ఈయన తెలుగు సినిమాను చెన్నై నుంచి హైదరాబాద్‌కు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాడు. తెలుగు సినిమాలో అరుదైన నటుడిగా గుర్తింపు పొందాడు. వ్యక్తిగతంగా ఆయన నాస్తికుడు. అయినా ఎన్నో భక్తి సినిమాలలో నటించాడు. అక్కినేని నాగేశ్వరరావు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ 2014 జనవరి 22న తుది శ్వాస విడిచారు. కొడుకు నాగార్జున, మనవడూ నాగచైతన్యతో కలిసి నటించిన మనం సినిమా ఆయన నటించిన చివరి చిత్రం. అక్కినేని 100వ జయంతి సందర్భంగా అక్కినేని స్మారక తపాలా స్టాంపు విడుదల చేశారు. అక్కినేని నాగేశ్వరరావు కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా నందివాడ మండలం రామాపురంలో 1924 సెప్టెంబరు 20న అక్కినేని వెంకటరత్నం, పున్నమ్మ దంపతులకు జన్మించాడు. చిన్ననాడే నాటకరంగం వైపు ఆకర్షితుడై అనేక నాటకాలలో స్త్రీ పాత్రలను ధరించాడు. అక్కినేనితో అన్నపూర్ణ వివాహం 1949 ఫిబ్రవరి 18న జరిగింది. ఆమె పశ్చిమగోదావరి జిల్లా దెందులూరులో 1933 ఆగస్టు 14న జన్మించింది. వారికి ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు, అక్కినేని వెంకట్, నాగార్జున, సత్యవతి, నాగ సుశీల, నాగ సరోజ, భార్య పేరుతో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించాడు. అన్నపూర్ణ స్టూడియోస్ బేనర్



ద్వారా కుమారుడు అక్కినేని నాగార్జున, మనవళ్లు సుమంత్, అఖిల్ సహా పలువురు నటీనటుల్నీ, దర్శకుల్నీ పరిచయం చేశాడు. అన్నపూర్ణ 2011 డిసెంబరు 28 న మరణించింది.

# సల్మాన్ ఖాన్ ఇంట డబుల్ సంబరాలు...



బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ కుటుంబంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఒకే రోజు రెండు పెళ్లిళ్ల వార్షికోత్సవాలు రావడంతో ఖాన్ ఫ్యామిలీ అంతా ఒకచోట చేరి సందడి చేసింది. సల్మాన్ తల్లిదండ్రులు సలీం ఖాన్, సల్మా ఖాన్‌లతో పాటు, ఆయన సోదరి అర్పితా ఖాన్ శర్మ, ఆయుష్ శర్మల పెళ్లి రోజు వేడుకలను నవంబర్ 18న కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య ఆనందంగా జరుపుకున్నారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను కుటుంబ సభ్యులు తమ సోషల్ మీడియా ఖాతాలలో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. సల్మాన్ సోదరుడు సోహైల్ ఖాన్ కుమారుడు నిర్వాన్ ఖాన్ షేర్ చేసిన ఒక ఫొటోలో ఖాన్ కుటుంబ సభ్యులందరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపించారు. సలీం ఖాన్, సల్మా ఖాన్, సల్మాన్, సోహైల్, అర్బాజ్, అర్పిత, ఆయుష్, అల్విరా అగ్నిహోత్రి తదితరులు నవ్వుతూ ఫొటోలకు పోజులిచ్చారు. ఈ సెలబ్రేషన్స్‌లో రెండు అందమైన కేకులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఒక కేక్‌పై సలీం, సల్మాల పేర్ల మొదటి అక్షరాలు 'S S' అని, మరో కేక్‌పై అర్పిత, ఆయుష్‌ల పేర్ల మొదటి అక్షరాలు »A Aµ అని ఉన్నాయి. సలీం-సల్మాలది 61వ వార్షికోత్సవం కాగా, అర్పిత-ఆయుష్‌లది 11వ వార్షికోత్సవం అని తెలిపేలా కేకులపై నంబర్లు పెట్టారు. అర్పితా ఖాన్ షేర్ చేసిన వీడియోలలో, సలీం-సల్మా దంపతులు కేక్ కట్ చేస్తుండగా కుటుంబ సభ్యులు చప్పట్లతో వారిని ఉత్సాహపరిచారు. మరో వీడియోలో ఆయుష్ శర్మ.. హెలెన్‌కు కేక్ తినిపిస్తున్న దృశ్యం కనిపించింది. ఈ ఫొటోలు, వీడియోలు ఖాన్ ఫ్యామిలీ మధ్య ఉన్న బలమైన అనుబంధాన్ని, ప్రేమను తెలియజేస్తున్నాయని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు






## ప్రకృతి అందాల నడుమ

# అందాల నేహా

'చిరుత' సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన నేహా శర్మ తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకుంటుందని అంతా భావించారు. చిరుత సినిమా హిట్ కావడంతో బ్యాక్ టు బ్యాక్ పెద్ద హీరోల సినిమా ఆఫర్లు వస్తాయి అనుకున్నారు. కానీ నేహా శర్మ తప్పుడు అడుగుల కారణంగా కెరీర్ మొత్తం తలకిందులు అయిందనే వారు చాలామంది ఉన్నారు. చిరుత వంటి మంచి హిట్ మూవీ తర్వాత కాస్త గ్యాప్ తీసుకుని సినిమాలను ఎంపిక చేసుకుంటే తప్పకుండా పెద్ద సినిమా ఆఫర్లు వచ్చేవి. చిన్న సినిమాలకు ఓకే చెప్పడం, పెద్దగా ప్రాధాన్యత లేని సినిమాల్లో నటించడం వల్ల ఈ అమ్మడికి ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. టాలీవుడ్‌లోనే కాకుండా ఈమె ఇతర భాషల్లోనూ నటించింది. కానీ లక్ ఈమెకు కలిసి రాలేదు. కానీ అందంతో పాటు, ప్రతిభ ఉన్న కారణంగా ఇండస్ట్రీలో ఇప్పటికీ కొనసాగుతోంది.

**నేహా శర్మ అందాల ఆరబోత..**

నేహా శర్మ ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపుగా 17 ఏళ్లు పూర్తి అవుతుంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి ఇన్నాళ్లు అవుతున్నా కూడా పాతికేళ్ల పడుచు అందం అన్నట్లుగా కనిపిస్తూ కవ్విస్తూ ఉంది. 37 ఏళ్ల వయసులోనూ టీనేజర్ మాదిరిగా కనిపిస్తున్న నేహా శర్మ చాలా మందికి ఇప్పటికీ అభిమాన నటి అనడంలో సందేహం లేదు. నాజూకు అందంతో పాటు, ఫోటో జెనిక్ ఫేస్ కావడంతో నేహా శర్మను చాలా మంది ఇప్పటికీ అభిమానిస్తూనే ఉంటారు. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అని చాలా మంది అంటూ ఉంటారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈమె షేర్ చేసే ఫోటోలు, వీడియోలను చూస్తే ఆ విషయం నిజం అనిపిస్తుంది. తాజాగా మరో ఫోటో షూట్ తో నేహా శర్మ చూపు తిప్పనివ్వడం లేదు. బాబోయ్ ఏంటి ఈ అందం అంటూ చాలా మంది నెటిజన్స్ కామెంట్స్ చేసేలా ఉంది.

**క్లీ వేజ్ షో తో మతిపోగొడుతోంది...**

ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 20 మిలియన్‌ల ఫాలోవర్స్ ను కలిగి ఉన్న నేహా శర్మ ఎప్పటిలాగే మరో అందమైన ఫోటో షూట్ ను షేర్ చేసింది. ఈసారి అందమైన ప్రకృతిలో నేహా కనిపించింది. సహజంగానే నేహా శర్మ చాలా అందంగా ఉంటుంది. అలాంటి నేహా శర్మ అందమైన ప్రకృతిలో ఉంటే అంతకు మించిన అందం అన్నట్లుగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. క్లీ వేజ్ షో చేస్తూ, థైస్ అందాలను చూపించడంతో పాటు, అందమైన ఫేస్ తో, డిఫరెంట్ ఔట్ ఫిట్ లో నేహా శర్మ చూపు తిప్పనివ్వడం లేదు అంటూ నెటిజన్స్ ఈ ఫోటోలను తెగ షేర్ చేస్తున్నారు. నేహా శర్మ షేర్ చేసిన కొన్ని గంటల్లోనే ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అంతే కాకుండా దాదాపుగా రెండు లక్షల మంది ఫోటోలను లైక్ చేయడంతో పాటు, కామెంట్ చేసి షేర్ చేశారు. దాంతో ఈ అమ్మడి క్రేజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు.

**బాడ్ న్యూస్ సినిమాతో అందాల నేహా**

ఇక ఈ అమ్మడి సినిమాల విషయానికి వస్తే... గత సంవత్సరం బాడ్ న్యూజ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో ప్రాధాన్యత ఉన్న గెస్ట్ రోల్ లో కనిపించింది. సినిమా ఆఫర్లు ఎక్కువగా వస్తున్నప్పటికీ ఆచితూచి ఎంపిక చేసుకుంటుంది అని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. బాలీవుడ్‌లో ఎక్కువగా ఈమె సినిమాలు చేస్తుంది. మంచి పాత్రలతో అప్రోచ్ అయితే తప్పకుడా సౌత్ సినిమాలు చేస్తాను అని ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో నేహా శర్మ చెప్పుకొచ్చింది. తప్పకుండా ఈ అమ్మడు మరోసారి టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేయాలని ఈ ఫోటోలు చూసిన వారు కొందరు కామెంట్స్ చేస్తున్నారు. నేహా శర్మ అందం ఏమాత్రం తగ్గకపోగా మరింత అందంగా ఇప్పుడు కనిపిస్తుంది. కనుక హీరోయిన్‌గా మరో పదేళ్ల పాటు నేహా శర్మ కు ఆఫర్లు వచ్చే స్కోప్ ఉంది. మరి ఫిల్మ్ మేకర్స్ పట్టించుకుంటారా అనేది చూడాలి



Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com